క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



అడపాలవీధి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని అడపాలవీధి 1,2,3, ఫైర్‌స్టేషన్, కొత్తహరిజనవాడ, ఖాజానగర్, గంగిరెడ్డిపల్లి, రాయచోటి రోడ్డు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ రాధిక మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్ల పూర్తయిన పిల్లలకు సర్టిఫికెట్లు అందించి వారిని ప్రాథమిక పాఠశాలకు పంపుతామన్నారు. మూడేళ్ల దాటిన పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మమత, ఇందిరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, హరిప్రియ, గంగాదేవి, మోక్షప్రియ, రాధ, సుమిత్ర, సరస్వతి, పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

25న వారపు సంత వేలం

తలుపుల: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 25న 2024–25కు గాను సర్పంచ్ శ్రీలత అధ్యక్షతన వారపు సంత వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు పంచాయతీ ఈఓ అబ్దుల్ మునాఫ్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.50 వేల డిపాజిట్‌తో పాటు, రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

నేడు వారపు సంత వేలం

అమడగూరు: స్థానిక గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వారపు సంత వేలం నిర్వహించనున్నట్లు విస్తరాణాధికారి నసీమా, పంచాయతీ కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. రూ.5 వేలు డిపాజిట్ చేసుకున్న వారికి మాత్రమే వేలంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వేలం పాటను దక్కించుకున్న వారు 24 గంటలలోపు పాడిన మొత్తం డబ్బును చెల్లించాల్సి ఉంటుందన్నారు.

దూదేకుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా అమీర్

ముదిగుబ్బ: రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా నాగలగుబ్బ గ్రామానికి చెందిన గొడుగు అమీర్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓతూరి రసూల్ నియామకం పత్రం అందజేశారు. సంఘం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని అమీర్ పేర్కొన్నారు.

గుండె వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నల్లచెరువు: స్థానిక సాయిబాబా ఆలయంలో కమిటీ సభ్యుల సహకారంతో గురువారం మదనపల్లి వెంకటేశ్వర ఆసుపత్రి డాక్టర్ బాల కిషోర్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. మండలానికి చెందిన దాదాపు 200 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు కరె రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ శుభ్రం



ట్యాంకును శుభ్రం చేయిస్తున్న కమిషనర్

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీలోని పెద్దకమ్మవారిపల్లి సత్యసాయి వాటర్ ట్యాంక్‌కు మున్సిపల్ కమిషనర్ గురువారం శుభ్రం చేయించారు. ట్యాంకు మూత తెరిచి ఉంచడంతో అందులో పడి 10 కోతిపిల్లలు చనిపోయాయి. నీరు దుర్వాసన వస్తుండటంతో స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ అక్కడికి చేరుకుని కోతుల కళేబరాలను తొలగించి ట్యాంకును శుభ్రం చేయించారు.

సత్యనారాయణ వ్రతం

కదిరిటౌన్: వాసవి అన్న సత్రం రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సత్రశాల శంకర్‌ర నారాయణ ఆధ్వర్యంలో గురువారం సత్యనారాయణ వ్రతం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

గుడిబండ: మండల కేంద్రంలో రైతులకు మేలైన పంట సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీ వాడకం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు. డ్రోన్ ద్వారా సస్య రక్షణ మందులను పిచికారీ చేయడం వల్ల సమయం వృథా కాదన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



పుట్టపర్తిలో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న అధికారులు



తలుపులలో విశ్రాంత ఆర్ఐని సన్మానిస్తున్న తహసీల్దార్, సిబ్బంది



ఆర్డీఓ, రిటైర్డ్ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పుట్టపర్తి అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తహసీల్దార్లు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులకు గుర్తింపు ఇవ్వడంతో పాటు విశ్రాంత ఉద్యోగులను సత్కరించుకునేందుకు రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకునేందుకు చక్కని వేదిక అన్నారు. రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్లు నాగార్జునశెట్టి, అశోక్‌గుప్తా, నారాయణస్వామిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, డీటీ నరసింహులు, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ఆవిర్భావం గురించి డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్ వివరించారు. ఆ శాఖ ద్వారా అందిస్తున్న రెవెన్యూ రికార్డులు, 1బీ, అడంగల్ తదితర సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పదవీ విరమణ చేసిన వీఆర్‌ఓ ఓబుళరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు రఘు, కిష్టప్ప, దీపిక, వీఆర్‌ఏలు రమేష్, రమణ, రూపా తదితరులు పాల్గొన్నారు.



ఎన్పీకుంటలో రిటైర్డ్ వీఆర్‌ఓ ఓబుళరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో గురువారం రెవెన్యూ ఉద్యోగులు రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు రెవెన్యూ సేవలను ఎలా పొందాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు రెవెన్యూ శాఖ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గంగన్న, సీఎస్‌డీటీ మునిస్వామి, సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రామకుమారి రెవెన్యూ శాఖ అందించే సేవలను తెలియజేశారు. ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ ప్రధానపాత్ర పోషిస్తుందన్నారు. విశ్రాంత ఆర్ఐ పి.జయచంద్రా రెడ్డిని దుశ్శాలువా, పూల మాల వేసి ఘనంగా సన్మానించారు. ఆర్ఐ శ్రీనివాస్, ఆయా గ్రామాల విఆర్‌ఓలు, విఆర్‌ఏలు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం సాయంత్రం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు 1786 జూన్ 20న నామకరణం చేశారన్నారు. రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం రిటైర్డ్ తహసీల్దార్ వెంకటేషులు, ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డిని రెవెన్యూ ఉద్యోగులు శాలువాలతో సన్మానించారు.

నల్లచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో విధులు నిర్వహించే సీనియర్ వీఆర్‌ఏలు వెంకట దాస్, నరసింహులను అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ క్రాంతి కుమార్, సర్వే డీటీ రమణబాబు, ఆర్ఐ అశోక్ కుమార్, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

తనకల్లు: మండలంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించనున్నట్లు జనజాగృతి వాటర్ ప్రాజెక్ట్ మేనేజర్ రాంప్రసాద్ అన్నారు. కొత్తకురవపల్లి, గొల్లపల్లిలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితుల్లో చిరుధాన్యాలు, నవధాన్యాలను సాగు చేయడం లాభదాయకమన్నారు. విచ్చలవిడిగా రసాయనిక మందుల వాడకం వల్ల వ్యవసాయ భూములలో దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందన్నారు. పురుగు మందులు లేని వ్యవసాయం చేయడాన్ని జనజాగృతి సంస్థ కృషి చేస్తోందన్నారు. మండలంలోని మల్లిరెడ్డిపల్లి, తవళం, గేమేనాయక్‌తండా, చీకటిమానిపల్లి తదితర పంచాయితీలకు చెందిన 19 గ్రామాల్లోని 1683 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయిస్తున్నామన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడానికి కషాయనాలు, ఘన, ద్రవ, జీవామృతాలను తయారు చేయడానికి రైతులకు ప్రత్యేకంగా శిక్షణను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బీడు భూములను సాగు భూములుగా తీసుకురావాడానికి తమ వంతు కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలోసంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంప్రసాద్

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



గాండ్లపెంటలో ర్యాలీ నిర్వహిసున్న విద్యార్థులు



ఎన్పీకుంటలో 'నేను బడికి పోతా'పై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

గాండ్లపెంట: మండలంలో 6 నుంచి 14 ఏళ్లలోపు బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం మండల కేంద్రంలో 'నేను బడికి పోతా' అనే కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కదిరి-రాయచోటి ప్రధాన రహదారి గుండా వైఎస్సార్ కూడలికి చేరుకుంది. కూడలిలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడగా విద్యాశాఖ అధికారులు క్రిష్టానాయక్, శ్రీనివాసులు విద్య ప్రాధాన్యతను తెలియజేసి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలంటూ కోరారు. స్థానిక ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య..

ఎన్పీకుంట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి తెలిపారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీషారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాల్ నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతరాయప్ప కుటుంబాన్ని ఆదుకునేందుకు జగన్ హామీ

మడకశిర: వైఎస్సార్‌సీపీ కార్యకర్త హనుమంతరాయప్ప కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు మడకశిర వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప తెలిపారు. ఆయన గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. గుడిబండ మండలం మండలపల్లికి చెందిన హనుమంతరాయప్ప ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మృతుడికి భార్య,ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో మృతుడి కుటుంబ పరిస్థితిని రాత మూలకంగా వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఈరలక్కప్ప ఫోన్‌లో సాక్షికి తెలిపారు. తప్పకుండా మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని జగన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే టీడీపీ నాయకుల దాడుల్లో నష్టపోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను నేరుగా కలవడానికి రాష్ట్రవ్యాప్తంగా త్వరలో పర్యటిస్తానని వైఎస్ జగన్ తెలిపారన్నారు. ఈ పర్యటనలో హనుమంతరాయప్ప కుటుంబాన్ని కూడా పరామర్శిస్తానని ఆయన చెప్పారన్నారు. అంతే కాకుండా ఈ సమావేశంలో తమకు పార్టీ అభివృద్ధిపై దిశా నిర్దేశం చేశారన్నారు.పార్టీ ఓడిపోయిందని ఆందోళన చెందవద్దని, 40 శాతం ఓట్లు తమ పార్టీకి వచ్చాయని, భవిష్యత్ తమదేనని వైఎస్‌జగన్ తమకు ధైర్యం చెప్పారన్నారు. వైఎస్ జగన్ సూచన మేరకు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతానని ఈరలక్కప్ప తెలిపారు.

'నీట్' ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

హిందూపురం టౌన్: నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపి, విద్యార్థులందరికీ న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ.. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్టీఏ వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని కోరారు. నీట్ పరీక్ష ఫలితాల్లో ఒకే పరీక్ష కేంద్రంలో ఒకే సీరియల్ నంబర్లతో కూడిన విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడిన అంశమన్నారు. తిరిగి పరీక్ష నిర్వహించే విధంగా కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, జస్వంత్, పవన్, లిఖిత్, అభి, హుస్సేన్, మహేష్, విక్రమ్, సురేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పౌరసరఫరాల గోడౌన్ ఆకస్మిక తనిఖీ

- డేటా ఆపరేటర్, స్టాకిస్టు లేకపోవడంపై ఆర్డీఓ ఆగ్రహం

గాండ్లపెంట: మండల కేంద్రం సమీపంలోని పోరెడ్డివారిపల్లి గ్రామంలో ఉన్న పౌరసరఫరాల గోడౌన్‌ను కదిరి ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ, తహసీల్దార్ శ్రావణితో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగి వద్ద ఉండాల్సిన డేటా ఎంట్రీ ఆపరేటర్, స్టాకిస్టు లేకపోవడంపై ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఆపరేటర్ ఎక్కడ ఉన్నాడంటూ అక్కడే ఉన్న ఎన్పీకుంట మండలం తాటిమాను గుంత డీలరు ప్రభాకర్‌ను ప్రశ్నించగా వస్తున్నాడంటూ ఆర్డీఓకు సమాధానం ఇచ్చారు. ఎవరూ లేకపోతే ఏం చూడాలి ఇక్కడ ఎవరూ ఇక్కడి రారా అని అసహనం వ్యక్తం చేశారు. డీలరు అన్నీతానై ఆర్డీఓకు రికార్డులను చూపించారు. గతంలోని స్టాకు సంబంధించి బిల్లులు అడగ్గా ఈ నెలకు సంబంధించిన బిల్లులు ఉన్నాయంటూ డీలరు ఆర్డీఓకు చూపించాడు. ఆర్డీఓ వచ్చిన అరగంటకు డేటా ఎంట్రీ ఆపరేటర్ తిలక్ గోడౌన్‌కు రాగా ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ గోడౌన్‌కు వస్తున్నావా, వస్తే ఇంత అపరిశుభ్రంగా ఎందుకుంటుందని ప్రశ్నించారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న సరకుల వివరాలను ఎవరిస్తారంటూ ప్రశ్నించారు. అనంతరం గోదాములో ఉన్న సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా లేదా అని అడగ్గా లేదని తెలిపారు. గోడౌన్ పరిస్థితి, ప్రహరీలను పరిశీలించారు. గిడ్డంగిలో 2021లో పట్టుబడిన బియ్యం బస్తాలను ఆర్డీఓ పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. గిడ్డంగిలోని మూడు గదుల్లో నిల్వ ఉన్న సరుకులను పరిశీలించి స్టాకు వివరాలను తెలుసుకున్నారు. ఆర్డీఓతో పాటు సీఎస్‌డీటీ సురేంద్ర, కదిరి వీఆర్వో విజయ్‌కుమార్ ఉన్నారు.



గోదాములో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ

యోగాతో మెరుగైన జీవనం

పుట్టపర్తి అర్బన్: యోగా సాధనతో మెరుగైన జీవనాన్ని పొందవచ్చని ప్రిన్సిపాల్ నాగసుప్రజ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి కేజీబీవీ ఆవరణలో అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉదయాన్నే యోగా సాధన చేయాలని తద్వార శరీరం ఆరోగ్యంగా, దృఢంగా ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. రోజూ వ్యాయామంతో పాటు నడకను అలవర్చుకోవాలన్నారు. యోగా ద్వారా శరీరంలోని రుగ్మతులను నయం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారు. యోగాతో మానసిక ఒత్తిడి కూడా దూరం చేసుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులతో యోగా డే అంటూ అక్షర క్రమంలో యోగాసనాలు వేయించారు. విద్యార్థులు వివిధ ఆసనాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పీడీ ఉమా, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న విద్యార్థినులు

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ నివారణ



చిన్నమొగలాయపల్లిలో వృద్ధుడికి బీసీజీ టీకా వేస్తున్న దృశ్యం



గ్రామస్తులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: 60 సంవత్సరాలు పైబడిన వారందరూ బీసీజీ టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలి. బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధిని నివారించొచ్చని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఉదయ్, డాక్టర్ రవినాయక్ సూచించారు. గురువారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టారు. చెన్నేకొత్తపల్లిలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్‌ను ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యుడు రవి నాయక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాక్సిన్‌ను వృద్ధులు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. క్షయ, బీపీ, షుగర్ వ్యాధులు దరిచేరే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. క్షయ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ విష్ణువర్ధన్, వైద్య సిబ్బంది రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, వనజ, సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఏఎన్ఎం సునీల, ఆశా వర్కర్ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మలకవేమల గ్రామంలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా వైద్యసిబ్బంది గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌ఓ భార్గవి, ఎస్ఏఎన్ఎం క్రిష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల, వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా వసతి గృహాల అధికారులు శ్యామల, శంకర్, నారాయణ స్వామి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వసతి గృహాల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుకు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, విద్యార్థి టీసీ, 4 పాస్‌ఫోటోలు, తల్లి బ్యాంక్ ఖాతా, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను జతపరచాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం

అమడగూరు: ఐరన్ మాత్రల వాడకం వలన రక్తహీనతకు దూరమవుతుందని వైద్యసిబ్బంది పేర్కొన్నారు. గురువారం అమడగూరు, గాజులపల్లిలో వైకేపీ, ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా రక్తహీనతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు రుతుక్రమ సమయంలో ఎక్కువగా రక్తహీనతకు గురవుతారని, అలా జరగకుండా స్థానిక వైద్యులను సంప్రదించి సలహాలను పాటించాలన్నారు. అలాగే మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

'సికిల్ సెల్'పై అవగాహన అవసరం

- డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్



తాడిమర్రిలో బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్

తాడిమర్రి: సికిల్ సెల్ వ్యాధిపై పూర్తి అవగాహన అవసరమని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సికిల్ సెల్ నిర్మూలన మిషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్యాధికారులు హరిత, గోవర్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన వైద్య సిబ్బంది, ఆసుపత్రికి వచ్చిన రోగుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సికిల్ సెల్ ఎనీమియా జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సంక్రమిస్తుందన్నారు. వైద్యుల సలహా మేరకు సక్రమంగా మందులు వాడితే పూర్తిగా నయం అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో కలసి సికిల్ సెల్ వ్యాధి మిషన్ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆమె తాడిమర్రిలో జరుగుతున్న క్షయ నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 70 ఏళ్ల పైబడిన వృద్ధులకు బీసీజీ టీకాలు వేయాలని ఆమె వైద్య సిబ్బందికి సూచించారు. ఆప్తాలమిక్ ఉరుకుందప్ప, సీహెచ్ఓ హేమలత, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, సూపర్ వైజర్ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు పాము కాటు

ధర్మవరం రూరల్: మండలంలోని ఆకుతోటపల్లిలో ఓ రైతు పాముకాటుకు గురయ్యాడు. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు యుగంధర్‌రెడ్డి గురువారం తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ప్రమాదపు శాత్తు పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పంచాయతీకి రూ.13.7 లక్షల ఆదాయం

చిలమత్తూరు: మండలంలోని చిలమత్తూరు మేజర్ పంచాయతీలో గురువారం వారపుసంతకు వేలంపాట నిర్వహించారు. వారపుసంతను రూ.2.37 లక్షలకు, షాపింగ్ కాంప్లెక్స్‌ను రూ.10.70 లక్షలకు పలువురు దక్కించుకున్నారు. పంచాయతీకి మొత్తంగా 13.7 లక్షలు ఆదాయం వచ్చినట్లు కార్యదర్శి రామ్లానాయక్ పేర్కొన్నారు. బస్టాండ్, జంతు వధశాల వేలంపాట వాయిదా పడినట్లు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయం



కళాశాలను సందర్శించిన భారత మాజీ రాయబారి

పెనుకొండ: ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయమని భారత మాజీ రాయబారి రోమెల్ ప్రశంసించారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలకు చెందినఎన్ఎస్ఎస్ వలంటీర్లు పుట్టపర్తిలో తరచూ జరిగే సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలను పెరుగుతాయన్నారు. త్వరలో పుట్టపర్తిలో జరిగే పర్తియాత్రకు విద్యార్థులు, అధ్యాపకులు హాజరుకావాలని ఆయన కోరారు. అధ్యాపకుల పనితీరును రోమెల్ కొనియాడారు. ప్రిన్సిపాల్ కేశవరావు, సత్యసాయి విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు దినేష్, కరుణాకర్, సత్యసాయి సమితి పెనుకొండ కన్వీనర్ శంకరప్ప, ఎన్ఎస్ఎస్ అధికారి రంగనాయకులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



స్నేహితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన మిత్రుడికి పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఆర్థికసాయం చేశారు. వివరాలు.. హిందూపురంలోని ముదిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993 బ్యాచ్ విద్యార్థులు తమ సహ విద్యార్థి సనావుల్లా అనారోగ్యంతో మంచాన పడినట్లు తెలుసుకున్నారు. మిత్రులంతా కలిసి పోగుచేసిన రూ.40 వేల ఆర్థికసాయాన్ని గురువారం సనావుల్లా కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో 93 బ్యాచ్ సంఘం గౌరవాధ్యక్షుడు రంగన్న, అశ్వర్థనారాయణ, అధ్యక్షుడు తిప్పేస్వామి మిత్ర బృందం సరళ, కేశమాంబ, చంద్ర, బాలకృష్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.